మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మైదం వరప్రసాద్.

రామగిరి, మార్చి 17(ప్రజాక్షేత్రం):

రామగిరి మండలం ఆదివారంపేట ఎస్సి కాలనీ కి చెందిన కన్నూరి బాణయ్య డయాల సిస్ వ్యాధి బారిన పడి అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ముత్తారం మండల మాజీ జెడ్పిటిసి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మైదం భారతి వరప్రసాద్ పరామర్శించారు. మృతుని చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించాడు. అనంతరం వారి కుటుంబానికి 2వేల రూపాయలు 25 కిలోల బియ్యం ఆర్థిక సహాయంగా అందచేసారు. వారి వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింతల శ్రీనివాస్ రెడ్డి, గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కన్నూరి శ్రీకాంత్, రామగిరి మండలం యూత్ ఉపాధ్యక్షుడు గోడిశేల సంతోష్, మండల బీసీ సెల్ ఉపాధ్యక్షుడు చెవుల కోటేష్,గ్రామ యూత్ కాంగ్రేస్ అధ్యక్షుడు మెండే ఓదెలు,నాయకులు చిప్పకుర్తి స్వామి,గోడిశేల రవి, కన్నూరి శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు లోపు భూ సేకరణ పూర్తి చేస్తాం

- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు
- పోలవరం ఎత్తును మాజీ సీఎం జగనే తగ్గించారని వ్యాఖ్య

ఏపీ బ్యూరో, మార్చి 17(ప్రజాక్షేత్రం):: పోలవరం ప్రాజెక్టుపై శాసన మండలిలో వాడి వేడిగా చర్చ కొనసాగుతంది. పోలవరం కోసం 2014 నుంచి ఇప్పటివరకు రూ.19,396 కోట్లు ఖర్చు చేసినట్లు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. ''పోలవరం కోసం కేంద్రం రూ.17,860 కోట్లు చెల్లించింది. ప్రాజెక్టు వల్ల 96,660 కుటుంబాలు ముంపునకు గురవుతున్నాయి. నిర్వాసితులకు తొలి దశలో రూ.1,203 కోట్లు అందించాం. ఇంకా 18,266 కుటుంబాలకు రూ.1340 కోట్లు చెల్లించాలి. ఇప్పటివరకు 12,797 నిర్వాసితుల కుటుంబాలను తరలించాం. ఇంకా 27,263 కుటుంబాలను తరలించాలి. 75 నిర్వాసితుల కాలనీల్లో 49 నిర్మాణంలో ఉన్నాయి. ఆగస్టు లోపు భూసేకరణ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. తొలి దశ ఆర్‌అండ్‌ఆర్‌ను 2026 జూన్ లోపు పూర్తి చేస్తాం. పోలవరం ఎత్తును జగన్ హయాంలోనే రెండుగా విభజించారు. పోలవరానికి 41.15 మీటర్ల ఎత్తు ప్రతిపాదన పెట్టింది వైసీపీ ప్రభుత్వమే. పోలవరం ఎత్తు ఎందుకు తగ్గించారో జగన్‌నే అడగాలి. నిర్వాసితుల కాలనీల్లో ఒక్క ఇంటికీ ఆయన హయాంలో పునాది వేయలేదు'' అని నిమ్మల రామానాయుడు అన్నారు.

పంజాబ్ రాష్ట్రంలో పోలీసుల దాష్టీకం

- ఆర్మీ అధికారి, అతడి కుమారుడిపై దాడి
- 12 పోలీసులపై సస్పెన్షన్ వేటు

నేషనల్ బ్యూరో మార్చి 17(ప్రజాక్షేత్రం): పార్కింగ్ వివాదంలో ఆర్మీ అధికారి, అతడి కుమారుడ్ని పోలీసులు దారుణంగా కొట్టిన ఘటన పంజాబ్ రాష్ట్రం పాటియాలలో చోటుచేసుకుంది. దీంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఫిర్యాదుపై పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. 12 మంది పోలీసులను సస్పెండ్ చేశారు. పంజాబ్‌లోని పాటియాలాలో ఈ సంఘటన జరిగింది. కల్నల్ పుష్పిందర్ బాత్, ఢిల్లీలోని ఆర్మీ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. మార్చి 13న పాటియాలాలోని ఒక రెస్టారెంట్ వద్ద కారు పార్క్ చేసేందుకు ఆయన ప్రయత్నించారు. కాగా, సివిల్ డ్రెస్‌లో ఉన్న పోలీసులు కారును అక్కడి నుంచి తీయాలని కల్నల్ పుష్పిందర్‌తో దురుసుగా చెప్పారు. ఈ సందర్భంగా వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన పోలీసులు కల్నల్ పుష్పిందర్‌ను దారుణంగా కొట్టారు. కారు నుంచి బయటకు లాగి కాలితో తన్నారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన కల్నల్ కుమారుడిపై కూడా పోలీసులు దాడి చేశారు. బేస్ బాల్ బ్యాట్లతో వారిని కొట్టారు. మరోవైపు పోలీసుల దాడిలో ఆర్మీ అధికారి కల్నల్ పుష్పిందర్, ఆయన కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. వారిద్దరూ ఆర్మీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫిర్యాదు అందుకున్న పోలీస్ ఉన్నతాధికారులు ఈ సంఘటనపై సీరియస్‌గా స్పందించారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. 12 మంది పోలీసులను సస్పెండ్ చేశారు. కాగా, బాధ్యులైన పోలీసులపై శాఖాపరమైన విచారణకు ఆదేశించినట్లు పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. 45 రోజుల్లో ఈ విచారణ పూర్తవుతుందని చెప్పారు. మరోవైపు కల్నల్, ఆయన కుమారుడ్ని పోలీసులు దారుణంగా కొట్టిన సీసీటీవీ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

ఈ నెల 24 తెలంగాణ ప్రజాప్రతినిధులకు ప్రత్యేక దర్శనాలు

- ఈ నెల 24 తెలంగాణ ప్రజాప్రతినిధులకు ప్రత్యేక దర్శనాలు
- తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై స్పందన
- సోమ, ఆదివారాల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు

ఏపీ బ్యూరో, మార్చి 17(ప్రజాక్షేత్రం): తెలంగాణ ప్రజా ప్రతినిధులకు ఇకపై తిరుమల వెంకటేశ్వరుడి దర్శనం సులభతరం అవ్వనుంది. ఈ మేరకు తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం కల్పించేందుకు అనుమతించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. ఈ మేరకు టీటీడీ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటనలో పేర్కొంది. తెలంగాణ నేతల సిఫార్సు లేఖలపై ఆదివారం, సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనాలు.. బుధవారం, గురువారం ప్రత్యేక ప్రవేశ దర్శనాలు ఉంటాయని తితిదే తెలిపింది. నిర్దేశిత రోజుల్లో ప్రజాప్రతినిధులకు సంబంధించి ఒక లేఖ మాత్రమే స్వీకరిస్తామని పేర్కొంది. మార్చి 24 నుంచి అమలు చేయనున్నట్లు తితిదే వెల్లడించింది.

తలాపున పారుతుంది గోదారి
నీ సేను నీ సేలక ఎడారి..!

- అడుగంటుతున్న భూగర్భ జలాలు.
- ఆందోళన చెందుతున్న రైతులు.
- పెట్టుబడి నష్టపోయామని ఆవేదన.

పెద్దపల్లి బ్యూరో, మార్చి 17(ప్రజాక్షేత్రం):

రోజురోజుకూ భూగర్భ జలాలు పడిపోతున్నాయి. దీంతో ఒక వైపు బోర్లు ఎత్తిపోతుండగా మరో వైపు బావుల్లో నీరు అడుగంటి పోతున్నాయి. దీంతో సాగు కష్టాల్లో, ఆర్థిక నష్టాల్లో రైతులు కూరుకుపోతున్నారు. నిన్న మొన్నటి వరకు పెద్దపల్లి జిల్లాపై కుండగా ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టులోని అంతర్భాగమైన అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో చుక్కనీరు లేకపోవడంతో బోర్లు, బావులు అడుగంటుతున్నాయి. దీంతో రైతులు తిరిగి బోర్లు వేసుకోవడం, బావులను పూడిక తీయడం లాంటి పనులను చేపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. తలాపున పారుతున్న గోదావరి నీ సేను నీ సెలుక ఎడారి అని స్థానిక కవి రచయిత మల్లావజ్ఞల సదాశివుడు మూడు దశాబ్దాల క్రితం తెలంగాణ సాగు నీటి కష్టాలను ఏకరువు పెట్టగా పదేళ్ల తర్వాత తిరిగి అదే పరిస్థితులు నెలకొనడంతో కాంగ్రెస్ పాలన వచ్చింది కష్టాలను వెంట బెట్టుకొని వచ్చిందనే విధంగా పాలన సాగుతుండటంతో రైతుల్లో అసహనం వ్యక్తం అవుతున్నది. పెద్దపల్లి జిల్లాలోని మంథని, ముత్తారం, పాలకుర్తి, అంతర్గాం, ధర్మారం మండలాల్లో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. 2023 ఫిబ్రవరి నెలలో భూగర్భజలాలు 5.47 మీటర్ల లోతులో ఉండగా 2024 ఫిబ్రవరి మాసంలో 5.09 మీటర్ల లోతులో,2025 ఫిబ్రవరి మాసంలో 5.44మీటర్ల లోతులోకి పడిపోయాయి. బీఆర్ఎస్ పార్టీపై కక్షతో కాళేశ్వరంను పక్కన పెట్టి తెలంగాణ రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా ముంచుతున్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో మోటార్లతో పని లేకుండానే కాలువల్లో సాగు నీరు పారిందని, కాళేశ్వరం గేట్లు ఎత్తడంతో బోర్లన్నీ ఎత్తిపోయి బోర్లల్లో కూడా చుక్క నీరు రావడం లేదని మూడేళ్ల దాకా ఇక సాగు అంతేనా..? అలాగైతే తాము ఎలా బ్రతుకుతామని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడి నష్టపోయమని ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు కామన్ ఎంట్రన్స్ టెస్ట్ కు దరఖాస్తులు ఆహ్వానం.

- బీసి గురుకులాల జిల్లా కో ఆర్డినేటర్ మణి దీప్తి.
- మార్చి31, 2025 గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి.
- ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష నిర్వహణ.

పెద్దపల్లి బ్యూరో, మార్చి 17(ప్రజాక్షేత్రం): గురుకులాల్లో ప్రవేశాలకు కామన్ ఎంట్రన్స్ టెస్ట్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, మార్చి 31,2025 గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని బీసి గురుకులాల జిల్లా కో ఆర్డినేటర్ మణి దీప్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నడిచే బీసీ బాలికల బాలుర పాఠశాలల్లో 2025 26 విద్యా సంవత్సరానికి గాను 6,7,8,9 (ఇంగ్లీష్ మీడియం) తరగతులలో ఖాళీ సీట్లలో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు తెలిపారు. ఆసక్తి గలవారు మార్చి 31 లోపు కుల సర్టిఫికెట్ ఆదాయ సర్టిఫికెట్, ఆధార్ కార్డు బర్త్ సర్టిఫికెట్ ఫోటోతో దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20న ఉంటుందని, వివరాలకు https://mgtbcadmissions.org ను పరిశీలించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

ఖమ్మం ప్రతినిధి మార్చి 17 (ప్రజాక్షేత్రం):

కుష్టువ్యాధి నిర్మూలకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్య అధికారిణి అరుణాదేవి అన్నారు. జాతీయ కుష్టు నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా ముదిగొండ మండల కేంద్రంలో సర్వే, అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య అధికారిణి మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 30 వరకు సర్వే కార్యక్రమాలు ఆశా కార్యకర్తలు నిర్వహిస్తారని గ్రామాల్లో ప్రజలు వైద్య సిబ్బందికి సహకరించాలన్నారు. కుష్టు వ్యాధి నిర్మూలన సర్వే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని, కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని, చర్మంపైన మచ్చలు ఉంటే వైద్యులను సంప్రదించాలని వైద్య అధికారిణి సూచించారు. లెప్రసీ వ్యాధిని ఎండిటి ద్వారా నివారించవచ్చని, మైక్రో బాక్టీరియాలేఫ్రీ అనే సూక్ష్మక్రిముల ద్వారా సంక్రమించే వ్యాధన్నారు. వ్యాధిగ్రస్తులకు శరీరం పాలిపోయి రాగి రంగు మచ్చలు, స్పర్శ లేకపోవడం, పొదాలు, చేతివేళ్లు తిమ్మిర్లు వంటి. లక్షణాలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ మధుసూదన్ రావు, స్టాఫ్ నర్స్ నాగరాజుకుమారి, ఫార్మసిస్ట్ సత్యవతి, సూపర్వైజర్ లత, ల్యాబ్ టెక్నీషియన్ రామారావు, సిబ్బంది శ్రీలక్ష్మి, రత్నకుమారి, మమత, రాణిలు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారం సత్వరమే పూర్తి చేయాలి.

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.

పెద్దపల్లి బ్యూరో, మార్చి 17(ప్రజాక్షేత్రం):

అర్జీల పరిష్కారం సత్వరమే పూర్తి చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఎలిగేడు మండలానికి చెందిన ఎం.అంజమ్మ సుల్తాన్ పూర్ గ్రామ శివారులో తన తండ్రికి 10 గుంటల వ్యవసాయ భూమి ఉందని, తన తండ్రి మరణించినందున ఆ భూమిని ధరణి లో తన పేరు పై చేర్చి పట్టా పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ ఎలిగేడు కు రాస్తూ విచారణ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అంతర్గాం మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన ఏ.శంకరవ్వ తమ గ్రామంలో ప్రాజెక్టు కింద ముంపుకు గురైందని, ఆడపిల్లల కూలి వేతనం(ఆర్ అండ్ ఆర్) ప్యాకేజ్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ పి హెచ్ ఎన్ ఎన్ టి గా కే పద్మజ కుమారి నియామకం

ఏలూరు మార్చ్ 17(ప్రజాక్షేత్రం): లింగ పాలెం పి హెచ్ సి నూతన పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ గా కె.పద్మజ కుమారి సోమవారం బాధ్యత తీసుకున్నారు. ఈ నేపథ్యంలో వైద్యాధికారి డా.డీ.సంధ్యారాణి కి జాయినింగ్ రిపోర్ట్ అందచేసారు. ఈ సందర్భంగా పి హెచ్ ఎన్ పద్మజ మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో అని ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరువ అయ్యేలాగున తన బాధ్యతలను నిర్వర్తిస్తాననీ ఈ సందర్భముగా చెప్పారు.



ఉచిత ఆర్మీ శిక్షణ కోరకు దరఖాస్తు చేసుకోవాలి.

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.

పెద్దపల్లి బ్యూరో, మార్చి 17(ప్రజాక్షేత్రం): అగ్నిపథ్ నోటిఫికేషన్ వెలువడిన సందర్భంగా ఆర్మీ ఉద్యోగం కొరకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ కోసం సెలక్షన్ ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు మెడికల్ టెస్ట్ ఫిజికల్ టెస్ట్ రాత పరీక్ష నిర్వహించి అర్హత పొందిన అభ్యర్థులకు భోజనం, వసతి తో ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని అన్నారు. అగ్నిపథ్ రాత పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులకు ఈవెంట్స్ కోసం ఉచిత శిక్షణతో పాటు భోజన వసతి ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశం కేవలం పెద్దపల్లి జిల్లా యువకులకు మాత్రమే ఉంటుందని అన్నారు. అభ్యర్థులు 01 అక్టోబర్ 2004 నుంచి 01 ఏప్రిల్ 2008 మధ్య జన్మించి ఉండాలని అన్నారు. ఆసక్తిగల యువకులు ఆన్ లైన్ లో అగ్నిపథ్ కు దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు చేసుకున్న ఫారం తో నేరుగా జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కార్యాలయం లో రిజిస్టర్ చేసుకోవాలని, వివరాలకు 9440167222, 8333044460, 9573688952 నెంబర్లలో సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ఇంట్లో విషాదం

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మాజీ సీఎం జగన్

ఏపీ బ్యూరో మార్చి 17(ప్రజాక్షేత్రం): ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ఇంట్లో విషాదం నెలకొంది. ఆయన మాతృమూర్తి పిచ్చమ్మ మృతిపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. పిచ్చమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న యర్రం పిచ్చమ్మ(85) ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం కన్నుమూశారు. మాతృమూర్తి మృతి వార్త తెలియడంతో వైవీ సుబ్బారెడ్డి హుటాహుటిన ఢిల్లీ నుంచి ఒంగోలుకు బయలుదేరారు. కాగా, పార్లమెంట్ సమావేశాల కోసం సుబ్బారెడ్డి నిన్ననే ఢిల్లీకి వెళ్లారు. నేడు ఒంగోలులోనే సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ పార్థివదేహం ఉండనుంది. రేపు ఉదయం 10:30 గంటలకు మేదరమెట్లలో ఆమె అంత్యక్రియల జరగనున్నాయి. పిచ్చమ్మ పార్థివదేహానికి వైఎస్ జగన్ నివాళులు అర్పించనున్నారు.